క్లుప్తంగా

వేంకటేశ్వరునికి జన్మ నక్షత్ర పూజలు


యండమూరులోని మీసాల వేంకటేశ్వరస్వామి

కరప: యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజయదశమి రోజున వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులతో వేంకటేశ్వరస్వామి వ్రతాలు చేయించారు. కరప విష్ణాలయంలోని వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు జరిగాయి. పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి, కూరాడ తదితర గ్రామాల్లో స్వామివారికి పూజలు నిర్వహించారు.

ఎస్పీ ఆయుధ పూజ


ఆయుధ పూజ నిర్వహిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: విజయ దశమి పర్వదినమైన గురువారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సతీ సమేతంగా ఆయుధ పూజ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ పూజలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణలో సేవలందిస్తున్న వివిధ ఆయుధాలను సమర్పించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: తమిళనాడుకు చెందిన మనుజ్యోతి ఆశ్రమం వారు దేశవ్యాప్త ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ మహోత్సవంలో భాగంగా అమృత మంజరి భాగం-2, తన ప్రేమ గల చేతుల నైపుణ్యం అనే పుస్తకాన్ని ఈ నెల 5న జేఎన్‌టీయూకే సమీపంలోని ఐఎంఏ భవనంలో సాయంత్రం 5 గంటలకు ఆవిష్కరించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. రాయుడుపాలెంలో శుక్రవారం ఈ వివరాలను ఆశ్రమ కాకినాడ సభ్యులు ప్రభాకరరావు, ఎర్రన్న, రమణ, మూర్తి తదితరులు మీడియా సమావేశంలో వెల్లడించారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నేడు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్స్ భవన్‌లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం శుక్రవారం తెలిపారు. ఉదయం 9.30కు జరిగే ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వి.నరసింహులు, ఎల్.సత్యన్నారాయణ, వి.విజయభారతి, పి.అనంతాచార్యులు, మోషేబాబు, ఇ.రెజీనా, వి.విమల కాంతికుమారిని సన్మానించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి సభ్యులంతా హాజరుకావాలని సంఘ ప్రధాన కార్యదర్శి నూకరాజు కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సత్కారం


ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: గత నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సత్కరించారు. సత్కారం పొందిన వారిలో ఎ.సత్యనారాయణ(ఎస్సై-కోరంగి పీఎస్), ఓ.అబ్బారెడ్డి (ఎస్సై-టూటౌన్ కాకినాడ), పి.శ్రీనివాసరావు(ఏఆర్‌ఎస్సై-కాకినాడ), ఎస్ఎస్‌వీ సత్యనారాయణ(హెచ్‌సీ-తుని రూరల్ పీఎస్) ఉన్నారు.

వంతెన.. యాతన

- ఇంద్రపాలెం బ్రిడ్జి గుంతలమయం
- రహదారిపైకి పిచ్చి మొక్కలు
- చెత్తాచెదారంతో దుర్వాసన
- ప్రయాణికులకు ఇక్కట్లు


దుర్వాసనకు కారణమవుతున్న వ్యర్థాలు


ఇంద్రపాలెం వంతెన వద్ద ఏర్పడిన గోతులు, చెట్ల కొమ్మలు

కాకినాడ లీగల్: కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉంది ఇంద్రపాలెం బ్రిడ్జి. కాకినాడ-సామర్లకోట రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ వంతెన అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. కాకినాడ నుంచి ఇంద్రపాలెం వైపు బ్రిడ్జిపై గోతులు ఏర్పడడంతో పాటు, వంతెనను ఆనుకుని మొక్కలు రహదారిపైకి రావడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. అంతేకాకుండా బ్రిడ్జి పక్కన చెత్త చెదారం వేస్తుండడంతో డంపింగ్ యార్డుగా మారింది. దీంతో ఇక్కడ పశువులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పశువులను విడిచిపెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఒక్కోసారి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. కాకినాడ-సామర్లకోట రహదారి పక్కనే ట్రాక్టర్లు, భారీ వాహనాలు నిలిపివేయడంతో వాహనచోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. రహదారి పక్కనే బొండాలు, ఇతర భవనాల శిథిలాలు వేయడంతో పారిశుధ్యం క్షీణిస్తోంది. గతంలో ఇంద్రపాలెం వంతెన నుంచి ప్రతాప్‌నగర్ బ్రిడ్జి వరకు రహదారికి ఇరువైపులా సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకు అప్పట్లో కార్పొరేషన్ కమిషనర్, అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆ ప్రతిపాదనలు నిలిచిపోవడంతో మళ్లీ రహదారి ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోతోంది. అధికారులు ఆయా సమస్యలపై దృష్టి సారించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

గోతులు పూడ్చండి

కాకినాడ-ఇంద్రపాలెం రహదారి గోతుల మయం కావడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు వేయకపోయినా కనీసం మరమ్మతులు చేసి గోతులు పూడ్చాలి. అలాగే రోడ్డు పక్కన చెత్తా చెదారాన్ని తొలగించి, రోడ్డు పైకి దూసుకొచ్చిన చెట్ల కొమ్మలు తొలగించాలి.


– జీఎస్ఆర్ కృష్ణారావు, స్థానికుడు

అపరిశుభ్రంగా మారుతున్నాయి

రోడ్ల పక్కన భవన శిథిలాలతో పాటు, స్థానికంగా సేకరించే చెత్తను వేయడంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. కొబ్బరి బొండాలు వ్యర్థాలు వేయడంతో వాటి వల్ల అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. రోడ్డ పక్కనున్న వ్యర్థాలతో భరించలేని దుర్వాసన వస్తోంది.


– ఎస్‌వీ వెంకటరమణ, స్థానికుడు

డీఎస్సీ మహిళా ర్యాంకర్లకు అభినందనలు


మూర్తి, తులసినిని సత్కరిస్తున్న అభ్యర్థులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఎస్సీ-2025లో వ్యాయామ ఉపాధ్యాయ నియామకాల్లో మహిళల విభాగం ఓపెన్ కేటగిరీలో మొదటి, రెండో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల అభినందన కార్యక్రమంలో శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ పీడీ మూర్తి మాట్లాడుతూ, తుని బాలికల పాఠశాలలో చదివి, జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చిన బి.జానకి 85.5 మార్కులు, జి.సత్య 83 మార్కులు, బి.స్వాతి 74.5 మార్కులు సాధించి వ్యాయామ ఉపాధ్యాయులుగా నియామకపత్రాలు అందుకోవడం జిల్లాకు గర్వకారణమన్నారు. వీరికి డీఎస్సీ శిక్షణ అందించిన వాయామ ఉపాధ్యాయులు మూర్తి, కె.తులసిని అభ్యర్థులు దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన మహిళలను ఖోఖో సంఘ జిల్లా అధ్యక్షుడు పట్టాభిరామం, కార్యదర్శి వాసు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు కలెక్టర్ సన్మానం


వాకలపూడిలో సన్మానం అనంతరం పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వాకలపూడిలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత గాంధీ చిత్రపటానికి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, గాంధీజీ స్వచ్ఛతకు, పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేవారని, ఆయన స్ఫూర్తితో గ్రామాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాకలపూడి గ్రామంలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఆయన సన్మానం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద రూ.2.45 లక్షలతో నూతనంగా నిర్మించిన గెస్ట్ రూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సతీష్, డిప్యూటీ ఎంపీడీఓ సీతారామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. కాకినాడ రెండో డివిజన్‌లో బీజేపీ నాయకుడు తుమ్మలపల్లి నాని ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు శుక్రవారం సన్మానం చేసి, పండ్లు పంపిణీ చేశారు.

ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి

కరప: మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏఓ గుత్తుల బీఎస్ నరసింహం తదితరులు నివాళులర్పించారు. పెనుగుదురు పంచాయతీ కార్యాలయంలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు అధికారులు, నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ హైస్కూల్‌తో పాటు, వివిధ ప్రాంతాల్లో జయంతి కార్యక్రమాలు జరిగాయి.

వైఎస్సార్ సీపీ ఎస్ఈసీ సభ్యులుగా బెజవాడ, గోపుశెట్టి

- కన్నబాబు, రాజాకు కృతజ్ఞతలు


గోపుశెట్టి బాబ్జీ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా కాకినాడ రూరల్ మండలానికి చెందిన ఇద్దరు సీనియర్ నేతలు నియమితులయ్యారు. తిమ్మాపురం సర్పంచ్, సీనియర్ నాయకుడు బెజవాడ సత్యనారాయణ, కొవ్వాడ గ్రామానికి మండల సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ ఎస్ఈసీ సభ్యులుగా నియమితులు కావడంతో పలువురు నేతలు, కార్యకర్తలు వారిని అభినందించారు. తమకు పదవి లభించేందుకు కృషి చేసిన మాజీ మంత్రి, పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబుకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. దశమి రోజున కాకినాడ వైద్యనగర్ క్యాంప్ కార్యాలయంలో కన్నబాబును కలిసిన బెజవాడ సత్యనారారాయణ కృతజ్ఞతలు తెలిపారు.


కన్నబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న బెజవాడ సత్యనారాయణ

పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు


కాకినాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి

– జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి

కాకినాడ రూరల్: తగ్గిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని జీఎస్టీ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి అన్నారు. జిల్లా వినియోగ సమాచార కేంద్రం, కాప్కో ఆధ్వర్యంలో శుక్రవారం తన ఛాంబర్‌లో ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీఎస్టీలో వచ్చిన మార్పులు పేద వర్గాల ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. జీఎస్టీ సూపర్ సేవింగ్ క్యాంపెయిన్ ద్వారా ప్రజల్లో అవగాహన తెస్తున్నామన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా ఆర్థిక సాక్షరత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ తోట లలిత, జిల్లా సమాచార కేంద్రం ఇన్‌చార్జి శివమూర్తి, జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: జీఎస్టీ-సూపర్ సేవింగ్ ప్రచారంలో భాగంగా ఏపీ డబుల్ బెనిఫిట్స్ ప్రచార పోస్టర్‌ను కార్పొరేషన్ కమిషనర్ భావన స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ తగ్గింపు మహిళా సాధికారతకు దోహదపడుతుందన్నారు.

9న యువజనోత్సవాలు

కాకినాడ రూరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ(సెట్రాజ్) ఆధ్వర్యంలో ఈ నెల 9న కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025 నిర్వహిస్తున్నట్లు సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. యువతకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి యువజనోత్సవాలు వేదికగా నిలుస్తాయని చెప్పారు. 15 నుంచి 29 ఏళ్లున్న యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జానపద నృత్యం, జానపద గేయం, కథ రాయడం, కవిత్వం, పెయింటింగ్ వంటి పోటీలతో పాటు, ఇన్నోవేషన్ ట్రాక్లో సైన్స్ మేళా తదితర అంశాలు ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులోని సెట్రాజ్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. వివరాలకు 98411 13065 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

పోలీసుల డ్రోన్ పెట్రోలింగ్


రామేశంపేటలో డ్రోన్ పెట్రోలింగ్‌ను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

గండేపల్లి: మండలంలోని హైవేని అనుకుని నిర్వహిస్తున్న ధాబాలు, సూరంపాలెంలో రామేశంపేటలోని ప్రైవేటు హాస్టళ్ల వద్ద ప్రత్యేక నిఘా కోసం డ్రోన్ పెట్రోలింగ్ పహరా నిర్వహిస్తున్నట్లు సీఐ వైఆర్కే శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆయా ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం ముందస్తు జాగ్రత్తగా డ్రోన్ పెట్రోలింగ్ చేయిస్తున్నట్లు ఆయన వివరించారు. సీఐ వెంట ఏఎస్సై చంద్రశేఖర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

అంబరాన్నంటిన బేతాళ సంబరం

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో నిర్వహించే బేతాళ సంబరం అంబరాన్ని తాకింది. శరన్నవరాత్ర ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బేతాళ స్వామి ఆలయంలో 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు, విజయదశమిని పురస్కరించుకుని గురువారం భారీఎత్తున బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పులతో బేతాళ సంబరం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు, పారిశ్రామిక వేత్తలు బొడ్డు వెంకటరమణ చౌదరి, గుణ్ణం చంద్రమౌళి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. సంబరాన్ని తిలకించడానికి దూర ప్రాంతాల నుంచి సైతం అధిక సంఖ్యలో జనం తరలిరావడంతో గ్రామం సందడిగా మారింది. ప్రతి ఇంట్లో పిండి వంటలు ఘుమఘుమలాడాయి. ఆలయం నుంచి గ్రామ వీధుల మీదుగా ఊరేగింపు కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో ఉన్నవారు స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముగింపు ఉత్సవాన్ని పురస్కరించుకుని బేతాళ స్వామిని గ్రామ శివారుకు తీసుకెళ్లి మట్టిలో పూడ్చి వేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొండపల్లి జగ్గారావు, సూరన్నచౌదరి, కాకర్ల గంగాధర్, గోలి శ్రీరామ్, సురేష్, గద్దె సాయిరాం ఆధ్వర్యంలో రాత్రి భారీఎత్తున బాణసంచా కాల్చారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు బందోబస్తు పర్యవేక్షించారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు నిడదవోలు సురేష్‌చౌదరి, నిడదవోలు రాంబాబు పాల్గొన్నారు.

బంగారు చీరలో బాలాత్రిపుర సుందరి దర్శనం

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో ఆఖరిరోజు గురువారం ఆలయాలకు భక్తులకు పోటెత్తారు. విజయదశమి కావడంతో ఏ ఆలయం చూసినా రద్దీగా కనిపించింది. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వేలాది మంది దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు, ప్రధానార్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక దేవాలయం వీధిలో బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు వెండి చీరలో దర్శనమిచ్చారు.

ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజ రాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు వెండి చీరలో దర్శనమిచ్చారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ అమ్మవారిని, స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు.


బంగారు చీరలో దర్శనమిచ్చిన సూర్యారావుపేట బాలాత్రిపురసుందరి అమ్మవారు



కరపలో ప్రత్యేకాలంకరణలో దుర్గాదేవి

అంబరాన్నంటిన దసరా సంబరం

కరప: మండలంలోని శరన్నవరాత్ర ఉత్సవాలు గురువారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా కరపలో దసరా సంబరం అంబరాన్నంటింది. ముందుగా గ్రామంలోని దుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఉంచి బ్యాండ్‌మేళం, బాణసంచా కాల్పులతో గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని కొత్తపేట, మెరకవీధి, పల్లపువీధి, సీతమ్మ వీధి, నీలయ్యతోట, రామకంచిరాజునగర్ కాలనీ,, బీసీవీధులు, ఎస్సీకాలనీ వారు సంయుక్తంగా ఏనుగు, హంస వాహనాలను కాగిత పూలు, బొమ్మలు, రంగు విద్యుద్దీపాలతో అలంకరించారు. బ్యాండుమేళం, కోలాటం, కోయ డ్యాన్స్, తీన్మార్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రి, తెల్లవార్లూ గ్రామంలో ఊరేగించారు. తెల్లవారుజామున ఏనుగు, హంస వాహనాలను ఎదురెదురుగా ఉంచి జమ్మిపత్రితో శమీపూజ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ సంబరాన్ని తిలకించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప ఎస్సై టి.సునీత, గొల్లపాలెం, కోరంగి, ఇంద్రపాలెం, సర్పవరం పోలీసు స్టేషన్ల సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కరప, నడకుదురు, యండమూరు, వలసపాకల, పెనుగుదురు, కొరుపల్లి, కొంగోడు తదితర గ్రామాల్లో ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాలు నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భారీ అన్న సమారాధనలు జరిగాయి.


వెండిచీరలో దర్శనమిచ్చిన దేవాలయం వీధిలోని బాలాత్రిపురసుందరి అమ్మవారు


వెండిచీరలో దర్శనమిచ్చిన భానులింగేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు


కరపలో విద్యుద్దీపాలంకరణలో మెరకవీధి హంస వాహనం


కరప సంబరంలో కాంతార వేషధారణ


కరప దసరా సంబరంలో నీలయ్యతోట వీధి ఏనుగు వాహనం